# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 20

. **అహ్మద్‌ఖాన్ యుద్ధ సన్నాహాలు** ఎంత రహస్యంగా చేద్దామనుకున్నా అది కాస్తా ఫిరోజ్‌షా చెవిన పడింది. ఫిరోజ్‌షా పాలనా వ్యవహారాలన్నీ తమ్ముడికే ఒదిలిపెట్టానా, తనూ ఓ కంట కనిపెడుతూనే ఉంటాడు. ఫిరోజ్‌షా అనుయాయిలు యుద్ధప్రయత్నాల కబురు మోసుకొచ్చారు. అది తెలిసిన్నుండీ ఫిరోజ్‌షాకి కంటి మీద కునుకు లేదు. ఏం చెయ్యాలో పాలుపోడం లేదు. గిసుదరాజ్‌కి చెబితే యుద్ధం వద్దని అంటాడు. మౌల్వీ మాట విని ఒకవేళ వద్దని తమ్ముణ్ణి వారిస్తే, దేవరాయలు దండెత్తి వచ్చేక చేసేదేమీ ఉండదు. ఏం చెయ్యాలో నిర్ణయించుకోలేక మౌల్వీ గిసుదరాజు వద్దకు వెళ్ళాడు. విషయం చెప్పాడు.

"ఎదుటివాడు రెచ్చకొట్టకుండా మనం యుద్ధానికి ఎగదోయడం ప్రజలకి మంచిది కాదు. క్రితంసారి యుద్ధంనుండి ఈ గుల్బర్గా ఇంకా కోలుకోలేదు. ఒక పక్క కరువు. మరో పక్క ఈ పొరుగు రాజ్యం బెడదా. ప్రజలు మానసికంగా కుంగిపోయారు, సుల్తాన్. యుద్ధం ఆపమని నా మాటగా చెప్పు. తక్షణమే నువ్వు గుల్బర్గా వెళ్ళు," అంటూ ఆదేశమిచ్చాడు. మౌల్వీ మాటలు విన్నాక ఫిరోజుఖాన్ గుల్బర్గా వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు.

గిసుదరాజ్ వెళ్ళమని ఆదేశమివ్వడంతో హుటాహుటిన బయల్దేరాడు. తనతో కొంతమంది సేవకుల్ని మాత్రమే తీసుకెళ్ళాడు. సుల్తాన్ వెళ్ళే రీతిలో కాకుండా మామూలు సైన్యాధికారి వెళ్ళినట్లుగా ఏర్పాటు చేయించుకున్నాడు. ఫిరోజాబాదుకి ఉత్తరాన ఉన్న గుల్బర్గాకి ఒక పూటలో వెళ్ళి రావచ్చు. సాయంత్రానికల్లా గుల్బర్గా చేరుకున్నారు.

మర్నాడే అహ్మద్‌ఖాన్ సైన్యం బయల్దేరడానికి ఏర్పాట్లు చేసుకుంటోంది. హఠాత్తుగా ఫిరోజ్‌షా రాకని చూసి విస్తుబోయాడు. తన సన్నాహాలు సుల్తానుకి ఎవరో చేర వేసారన్న అనుమానం వచ్చింది. ఆరా తీసాడు కానీ ఎవరికీ తెలియదన్నారు. హుటాహుటిన ఫిరోజ్‌షా మందిరానికి వెళ్ళాడు. ఈలోగా ఫిరోజ్‌షా మొత్తం వివరాలన్నీ సేకరించాడు. విషయం అర్థమయ్యింది. తమ్ముడి దుందుడుకితనం తెలుసుకొని విచారించాడు. అహ్మద్‌ఖాన్ని తక్షణమే రమ్మనమని కబురంపాడు. కబురు చేరకుండానే అహ్మద్‌ఖాన్ రావడంతో ఈసారి ఆశ్చర్యపోవడం ఫిరోజుషా వంతయ్యింది.

తమ్ముణ్ణి చూడగానే కోపం వచ్చినా పైకి నిగ్రహించుకొని, "నే విన్నది నిజమేనా?" అని ప్రశ్నించాడు.

అహ్మద్‌ఖాన్ అంతకంటే ఎక్కువ నిగ్రహం నటిస్తూ, "ఏమిటది?" అని ఎదురు ప్రశ్న వేసాడు.

ఇహ లాభంలేదనుకొని ఫిరోజుషా సూటిగా విషయానికొచ్చేసాడు.

"అదే! దేవరాయల మీద యుద్ధానికి వెళుతున్నావట కదా? మాకు మాట మాత్రం కూడా చెప్పనవసరం లేదా?"

సేవకుల ముందు ఏకవచన సంబోధన విన్న తరువాత అహ్మద్‌ఖాన్‌కి విషయ తీవ్రత అర్థమయ్యింది.

"అవును. మనల్ని మనం రక్షించుకోవడం యుద్ధమయితే, మీరు విన్నది నిజమే!"

తమ్ముడి సమాధానం మరింత కోపం తెప్పించింది ఫిరోజ్‌షాకి.

"ఎదుటి వాడు దాడి చేస్తే రక్షించుకోవడం అంటారు. మనంతట మనం ఉసి గొల్పితే దాన్ని ఆత్మరక్షణ అనరు. ఈ డొంక తిరుగుడు ఎందుక్కానీ సూటిగా విషయం చెప్పు," కాస్త కటువుగానే అన్నాడు.

ఇహ లాభం లేదనుకొని, అహ్మద్‌ఖాన్ విషయమంతా చెప్పాడు. తనకి వేగుల ద్వారా దేవరాయులు యుద్ధానికి వస్తున్నాడని తెలిసిందనీ, ముద్గల్లో సైన్యం మోహరించాడనీ చెప్పాడు. ఈసారి మాత్రం ముందు జాగ్రత్తగా సైన్యాన్ని సంసిద్ధపరుస్తున్నానీ అన్నగారిని నమ్మించాడు.

"సుల్తాన్! నన్ను నమ్మండి. ఒక పక్క మన కోశాగారం నిండుకుంటూంటే యుద్ధం ప్రకటించేటంతటి వెర్రిబాగులవాడినా నేను?" అంటూ నింపాదిగా అన్నాడు.

"అయితే మరిదంతా ఏమిటి?"

"మీకెవరో తప్పుడు సమాచారం అందించారు. మన సైన్యాన్ని సరిహద్దుల వద్ద మోహరిస్తున్నామంతే! దేవరాయలు మన రాజ్యంలోకి రాకుండా అరికడుతున్నాం. ప్రతీసారిలా కాకుండా ఈసారి వ్యూహాత్మకంగా ప్రధాన రహదారుల వద్ద అప్రమత్తం చేస్తున్నానంతే! నా మాట నమ్మండి."

తమ్ముడి మాటలు నమ్మ బుద్ధి కాలేదు ఫిరోజ్‌షాకి. అబద్ధం చెబుతున్నాడని తెలిసినా ఈసారి మాత్రం కాస్త తెలివిగా వ్యవరించాడు.

"సరే! నువ్వు చెప్పేదే నిజమయితే రాయచూరు వెళ్ళే సైన్యంతో నేనూ వెళతాను. కావాలంటే నువ్వే ఈ గుల్బర్గాలో ఉండి పర్యవేక్షించు," తమ్ముణ్ణి ఆదేశించాడు.

అన్నగారి మాటలకేం జవాబివ్వాలో తెలీలేదు. తను రాయచూరు వైపుగా వెళదామనుకున్నాడు. కానీ అన్నగారు ప్రస్తుతం తనని నమ్మేట్లా లేడు. నమ్మించాలంటే ఒకటే మార్గం. అది సరేననడం. ఈ విధంగానయినా సుల్తాన్‌కి నమ్మకం కుదరవచ్చని మనసులో అనుకున్నాడు.

"సరే, మీ ఇష్టం. మీరు రాయచూరు సైన్యాన్ని నడిపించండి. మీరు చెప్పినట్లుగా నేను గుల్బర్గాలో ఉంటాను. మీకేవసరం వచ్చినా వెంటనే కబురు పంపించండి. కావలసిన ఏర్పాట్లు చేయిస్తాను. నాతో ఒక వెయ్యిమంది సిపాయిలనే రాయచూరు వైపు తీసుకెళదామనుకున్నాను. మీరు వెళతానంటున్నారు కనుక మరో వెయ్యిమందిని మీతో పంపిస్తాను," అంటూ అన్నగారి మాటకి సరేనన్నట్లుగా తలూపాడు.

జరిగేదేదో జరిగి తీరుతుంది. అల్లా ఎలా దీవిస్తే అలాగే జరుగుతుంది. తన పథకం మాత్రం ప్రస్తుతం గాడి తప్పింది. తనకి అన్నగారి నమ్మకం అవసరం. ఇన్నాళ్ళూ అదే తన రాజ్యకాంక్షకి నీరుపోస్తోంది. ఒక చిన్న పట్టింపుతో అది ఆపకూడదని నిశ్చయించుకొని తన మహలుకి వెనుదిరిగాడు

00000000000000

వయసు ఏభయ్యో పడిలోకి వచ్చినా ఫిరోజ్‌షా చూడ్డానికి యువకుడిలాగే ఉంటాడు. తమ్ముడు అహ్మద్‌ఖానే ఫిరోజ్‌షాకి అన్నగారిలా కనిపిస్తాడు. పైగా ఫిరోజ్‌షాకి మంచి శరీర ధారుడ్యముంది. పోరాటపటిమి కూడా తక్కువేమీ కాదు. యుద్ధమంటే అతనికి మక్కువెక్కువే! తమ్ముడిని నమ్మినట్లు నటించాడు కానీ విషయమంతా తనకి తెలుస్తూనే ఉంది. సరే యుద్ధమే అయితే పోరాడచ్చు. ఒకవేళ శత్రువే వెనుదిరిగినా తమకొరిగే నష్టమేమీ లేదనుకున్నాడు.

ఆ మర్నాడు ఉదయమే సుమారు రెండు వేలమంది సిపాయిల బలగంతో రాయచూరు వైపు వెళ్ళాడు. సాయంత్రానికల్లా హిందుపూరనే ఒక పల్లెటూరి వరకూ వచ్చారు. దేవరసుగూరు ఊళ్ళోకి వెళ్ళాలంటే

కృష్ణా నది దాటాలి. ప్రతీసారీ రాయచూరు యుద్ధాల్లో ఈ కృష్ణా నది దాటడమే సైన్యానికి పెద్ద సమస్యగా ఉండేది. అది దాటితే చాలు, రాయచూరు చేరుకున్నట్లే. వర్షాకాలమయితే నదీ ప్రవాహం చాలా ఎక్కువగా ఉంటుంది. సైనికులూ నది దాటడానికి సాహసించరు.

ప్రస్తుతం వేసవి కావడంవల్ల కృష్ణానది సుమారుగా ఎండిపోయింది. చిన్నగా ప్రవాహం తప్ప ఇంకేమీ కనిపించలేదు. రాత్రికి నది ఒడ్డునే బస చేసి తెల్లవారు ఝామునే  రాయచూరు వెళ్ళాలని సైనికాధికారికి ఆదేశించాడు. బాగా పొద్దుబోతే సైనికులూ ఎదుర్కోడానికి సిద్ధంగా ఉంటారు. ఉదయాన్నే అయితే తమకి ఎదుర్కోవడం సులభమన్నది ఫిరోజ్‌షా ఆలోచన. ఆ ప్రకారమే సూర్యోదయం కాకమునుపే కృష్ణా నది దాటారు. తెల్లవారకుండానే దేవరసుగూర్ చేరారు.

సాధారణంగా విజయనగర సైనికులు నదికీవల దేవరసుగూర్ దగ్గర పహారా ఉంటారు. ఫిరోజ్‌షా సైన్యానికెట్టి అవరోధాలూ లేకుండానే దేవరసుగూర్ చేరుకున్నారు. సైన్యాన్ని చూసి ప్రజలు కాస్త భయపడిన మాట వాస్తవమే కానీ, అంతమంది సైన్యాన్ని చూసి ఎవరూ ప్రతిఘటించలేదు. ఫిరోజ్‌షాకీ ఇది ఆశ్చర్యం కలిగించింది.

క్రితంసారి యుద్ధంలో విజయనగర సైన్యం తమ సైన్యాన్ని తరిమి కొట్టారు. సగానికి పైగా తమకి నష్టం వాటిల్లింది ఈ దేవరసుగూర్ వద్దనే. అటువంటిదీ ఏమ్మాత్రం కష్టం లేకుండా సునాయాసంగా ప్రజలు లొంగిపోవడం నమ్మబుద్ధి కాలేదు. దేవరాయల్ది పెద్ద వ్యూహమేదో ఉంటుందని అనుకున్నాడు. కాస్త పొద్దెక్కగానే రాయచూరు చేరుకుంది సైన్యం.

దేవరసుగూరులో ఎదురైన పరిస్థితే ఇక్కడా కనిపించింది. అంతమంది సైన్యాన్ని చూసి జనం కంగారుపడినా ఎక్కడా ఎవరూ ఎదురించలేదు. దాంతో మరింత ధైర్యం వచ్చి, దేవరాయల పహారా సైన్యమున్న గుడారాల వైపుగా వెళ్ళారు. ఒక్క రక్తపుబొట్టూ చిందకుండా, ఒక్క సైనికుడి ప్రాణ నష్టం కలుగుకుండా ఇంతవరకూ రావడం చూసి ఫిరోజ్‌షా సైన్యం మొత్తం ఆశ్చర్యబోయింది. ఏమ్మాత్రం శ్రమలేకుండా రాయచూరుని స్వాధీన పరుచుకున్నారు.

ఇన్నివేల మంది సైన్యాన్ని చూసి ప్రజలు భయపడి ఇళ్ళల్లోంచి బయటకి రాలేదు. ఈ హఠాత్పరిణామానికి కంగారు పడ్డారేమో తెలీదు, రాయచూరులో ఉన్న సైన్యం కూడా ఫిరోజ్‌షాకి లొంగిపోయారు. ఊహించని విజయం ఫిరోజ్‌షా వశమయ్యింది. ఇంతకాలమూ వివాదాస్పదంగా ఉన్న రాయచూరు గుల్బర్గా సుల్తానుల హస్తగతమయ్యింది. ప్రజలనెవ్వరినీ భయపెట్టొద్దనీ, వారికి ప్రాణాపాయం లేదని చెప్పమని సైన్యానికి ఆదేశించాడు.

ఫిరోజ్‌షాకి ఈ ఊహించని విజయం మరింత ధైర్యాన్నిచ్చింది. రాయచూరు తమ ఆధీనంలోకి పూర్తిగా వచ్చిందన్న వార్త అహ్మద్‌ఖాన్‌కి కబురంపాడు.

ఆ ఉత్సాహంలో విజయనగరమ్మీద దాడి చేస్తే ఎలా వుంటుందన్నా ఆలోచనొచ్చింది. తన మనసులోమాట సైనికాధికారులకి చెప్పాడు. కొంతమంది సరేనని ఉత్సాహం చూపించి సమర్థించినా, ప్రధాన సైనికాధికారి ఫరూక్ మాత్రం కాస్త జంకాడు.

"వద్దు సుల్తాన్! మనంతట మనం ఇలా యుద్ధానికి వెళ్ళడం తీరికూర్చుని ప్రాణాపాయం తెచ్చుకున్నట్లే! రాయచూరు మనం ఆ-క్రమించామన్న వార్త ఈ పాటికి దేవరాయల్కి చేరవేయడానికి వారి వేగులు వెళ్ళే ఉంటారు. పైగా ఈ కొండలూ, గుట్టలూ చూస్తూంటే దారి కనుక్కోడం కూడా కష్టమే! మనమిక్కడితో ఈ యుద్ధాన్ని ఆపేద్దాం. అనుకోకుండా వచ్చిన విజయాన్ని అలుసుగా తెస్సుకుంటే మనకే ప్రమాదం హుజూర్!" మెల్లగా హెచ్చరించాడు.

ఫిరోజ్‌షా అతని మాటలు ఖాతరు చెయ్యలేదు. మిగతా అందరూ ఇదే అదనుగా విజయనగరంపై దాడి చెయ్యాలని సమర్థించారు. ఇహ వెనుదిరిగేది లేదనీ, తమ గమ్యం ముందుకేనని ఫిరోజ్‌షా తన నిర్ణయాన్ని చెప్పాడు.

మనిషికి విజయం ఆత్మవిశ్వాసన్నిస్తుంది. ఉత్సాహాన్నిస్తుంది. ఆత్మవిశ్వాసపు వెలుగు క్రింద అహకారం నీడ కూడా ఉంటుంది. నీడ వెలుగు కన్నా పెద్దది కాకూడదు. అది జరిగితే చివరకి మిగిలేది చీకటే!

00000000000

రాయచూరుని ఫిరోజ్‌షా సైన్యం చుట్టుముట్టిందన్న వార్త మసూంకి కాస్త పొద్దెక్కాక తెలిసింది. ఉదయాన్నే కోట గుమ్మ వద్దకు వచ్చేవాడు. ఆనాడు కాస్త పొద్దు పోయేకా వచ్చి చూస్తే ఊరంతా ముసల్మానుల సైన్యం. అహ్మద్‌ఖాన్ ఇంత త్వరగా యుద్ధానికి సిద్ధపడతాడని ఊహించలేదు. హుటాహుటిన ఇంటికొచ్చాడు. రేవన్ననీ, నేహలనీ ఎవరినీ బయటకు రావద్దనీ హెచ్చరించడానికి వచ్చాడు. రొప్పుతూ ఇంట్లోకి అడుగుపెడుతూనే వీధి గుమ్మ తలుపేసేసాడు. పెరటివైపు కూడా తలుపులు మూసేసి ఒక్కసారి మధ్య గదిలోకొచ్చి స్థంబం వద్ద కూల బడ్డాడు. అతన్ని చూసి కంగారుగా రేవన్నా, హరీంద్రా కంగారు పడ్డారు. నేహల తల్లికి ఒక్కసారి ఏం జరుగుతోందో తెలియ లేదు. నేహల ఆశ్చర్యంగా చూస్తున్నా లోపల భయంగానే వుంది.

ఏం జరిగిందని చివరకి రేవన్నే అడిగాడు.

"రాయచూరుని గుల్బర్గా సైన్యం ఆక్రమించుకుంది. ఇందాక కోట గుమ్మం దగ్గరకెళ్ళేసరికి అక్కడం మొత్తం ఫిరోజ్‌షా సైన్యం. మళ్ళా యుద్ధం జరుగుతుందేమో? మీరెవ్వరూ ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రావద్దు. దేవరాయలకీ విషయం తెలిస్తే మరో పెద్ద యుద్ధమే జరుగుతుందనిపిస్తోంది. రేవన్నా! నువ్వు వీళ్ళని విడిచి బయటకు రావద్దు. నేను బయటకెళ్ళి అసలేం జరుగుతూందో తెలుసు కుంటాను. కాస్త జాగ్రత్తగా ఉండండి," ఆయాస పడుతూ చెప్పాడు.

అక్కడున్న అందరూ ఇది విని ఆశ్చర్యపోయారు. ఎవరికీ ఏంజరుగుతోందో ఒక క్షణం అర్థం కాలేదు.

"ఇదేవిటి హఠాత్తుగా ఫిరోజ్‌షా దండెత్తడం? ఏడాది క్రితమే కదా దేవరాయలకీ, వాళ్ళకీ యుద్ధం జరిగింది. వాళ్ళిలా వస్తున్నారనీ నీకు ముందుగా తెలీదా? నీకీపాటికి తెలిసే ఉండాలి కదా?"

మసూం విజయనగర రాజుల వద్ద వేగని రేవన్నకి తెలుసు. అందుకే అనుమానమొచ్చి అడిగాడు.

"నాకు తెలుసు. కానీ కావాలనే నేను దేవరాయలకీ వార్త చేర్చ లేదు." ఆ మాటలంటూంటే అతని కళ్ళు తీక్షణంగా ఉన్నాయి.

"అదేవిటి? ఎందుకు చెప్పలేదు? యుద్ధమొస్తే ఎంతమందికి నష్టం? ఎందుకిలా చేస్తున్నావు? ఇది రాజద్రోహం కాదా? అన్యాయం కదూ?"

రేవన్న మాటల్లో కోపం ధ్వనించింది. రేవన్నొక్కడే అడుగుతున్నాడు. ఎందుకంటే అతనికే మసూం ఎవరో, ఏమిటో తెలుసు. మిగతా ఎవరూ మౌనంగానే చూస్తున్నారు.

"ఏవిటి రాజ ద్రోహం? ప్రజలని కన్న బిడ్డల్లా చూసుకునే వాడే రాజు. వాళ్ళ చర్మాలతో హర్మ్యాలు నిర్మించుకొని విలాసాలు చేసేవాడు రాజు కాదు. అలాంటి వాడికి సహాయం అందివ్వకపోవడమే రాజనీతి." పళ్ళు పటపటా కొరుకుతూ అన్నాడు.

"మసూం! నీ మాటలు వింతగా ఉన్నాయి. ముసల్మానువయినా విజయనగర రాజుకి ఎంతో విశ్వాసంగా ఉన్నావనుకున్నాను. నీకు రాజభక్తిని చూసి మురిసి పోయాను. అలాంటిది నువ్వు...నమ్మలేకుండా ఉన్నాను," రేవన్న ఆశ్చర్యబోతూ అన్నాడు. అతనికి మసూం మాటలు వింతగా తోచాయి.

"నువ్వనుకున్నట్లు నేను దేవరాయల వేగుని కాను. వాళ్ళదగ్గర వేగుగా చేరినట్లు నమ్మించాను. నిజానికి నేను అహ్మద్‌ఖాన్ నియమించిన వేగుని. ఇంకో విషయం. మీరందరూ అనుకున్నట్లు నేను ముసల్మానుని కాను. నా అసలు పేరు బసప్ప. మాది దేవసుగూర్" మెల్లగా అన్నాడు.

ఈ సారి అందరూ నోరెళ్ళబెట్టారు. రేవన్నకీ అంతా అయోమయంగా వుంది.

"నీ పేరు బసప్పా? మరెందుకు పేరు మార్చుకున్నావు? ఏవిటీ గందరగోళం?" రేవన్నకేమీ అర్థం కావడం లేదు.

"చెప్తా వినండి. మాది దేవసుగూర్. నేను అక్కడ ఒక రైతుని. అక్కడే పుట్టి పెరిగాను. వ్యవసాయం మా కుటుంబం ఆదారం. మా నాన్నకి నేనొక్కడినే కొడుకుని. వయసు రాగానే నాకు పెళ్ళి చేసారు. నా భార్యది గంగావతి. చాలా అందంగా ఉండేది. ఎంతమందంటే, ఇదిగో ఈ నేహలకంటే పదింతలు అందంగా ఉండేది. పెళ్ళయ్యాక దేవసుగూర్ వచ్చేసింది. ఒకసారి మా కుటుంబం హంపీ విరూపాక్షుణ్ణి చూడ్డానికని విజయనగరం వెళ్ళాం. సరిగ్గా అదే సమయంలో దేవరాయలు కూడా దేవుని దర్శనానికొచ్చాడు. మందీ మార్బలంతో వచ్చే రాజు ఆనాడు కేవలం అంగరక్షులతోనే వచ్చాడు. అప్పుడు మేం దర్శనం చేసుకొని ముఖద్వారం దాటి వస్తూండగా నా భార్య అరుంధంతి దేవరాయల కళ్ళల్లో పడింది. ఒక్క క్షణం ఆగి చూసాడు. మేం మహారాజని ఆయన్ని గుర్తించలేదు. ఎవరో రాజకుటుంబానికి చెందిన వాడని అనుకున్నాం. మేం ఇవేమీ పట్టించుకోకుండా బయటకి వచ్చాం. ఈలోగా నేను  అరుంధతికి ఒక నేత చీర కొందామని ఒక దుకాణానికి వెళ్ళాను. మా తల్లితండ్రులు అంత దూరం నడవలేరని వారివద్దే అరుంధతి ఉండి పోయింది. ఈలోగా మహారాజు సైనికుడొచ్చి మా వాళ్ళ ఆచూకీ తెలుసుకున్నాడట. ఏదో కొత్తగా ఊరొచ్చాము కదాని అడిగుంటాడని అనుకొని మా వూరెళ్ళి పోయాం. ఓ వారం తరువాత పదిమంది సైనికులతో ఒకాయనొచ్చాడు. మహారాజు అరుంధతికి రాజమందిరానికి ఆహ్వానించాడు. నేనూ మెతో బయల్దేరబోయాను. నన్ను వద్దని ఆమెనొక్కత్తినే తీసుకు రమ్మన్నది రాజాజ్ఞని చెప్పారు. నేను కుదర్దని చెప్పి పంపించేసాను. ఆ తరువాత నేను లేని సమయం చూసి మా ఇంటిపై దాడి చేసారు. అడ్డొచ్చిన నా తల్లి తండ్రుల్ని చంపి, అరుంధతిని ఎత్తుకుపోయారు. పొరుగువాళ్ళు ఈ విషయం నేను ఇంటికి తిరిగొచ్చాక చెప్పారు. అప్పటికే మా తల్లితండ్రులు మరణించారు. ఆ దుఃఖంలో అరుంధతి కోసం విజయనగరం పరిగెత్తాను. ఎక్కడుందని అడగను? ఎవర్నడగను? విజయనగరంలో మెల్లగా వాకబు చేస్తే ఎవరో చెప్పారు. మూడు నాళ్ళ క్రితం రాజమందిరం పైనుండి దూకి ఒక అందమైన పిల్ల ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. నాకెందుకో నా అరుంధతే అనిపించింది. ఊరందర్నీ అడిగాను. చివరికాయన తుంగభద్రా నది వద్ద దహనం చేసారనీ,  శ్మసానం వద్దున్న కాటికాపర్ని అడగమని చెప్పారు. పరుగెత్తుకెళ్ళాను. అతను చెప్పిన వివరాలను బట్టి అది అరుంధతేనని రూఢయ్యింది. అందమైన అమ్మాయిలని ఇలా అనుభవించడం రాజులకిది కొత్తేం కాదనీ, అందునా దేవరాయల కామాంధుడనీ చెప్పారు. ఏం చెయ్యను? నా జీవితం కకావికలమయ్యింది. అంధకారబంధురంగా మారింది. ఎవరికోసం బ్రతకాలి? నా వాళ్ళని దూరం చేసాడన్న కోపంతో దేవరాయలమీద కక్ష కట్టాను. నేనొక్కణ్ణే ఎదుర్కోలేను. కానీ అతని శత్రువులకి సాయం చేసి అతన్ని మట్టుబెట్టాలని నిశ్చయించుకున్నాను. ఆ కక్షతో గుల్బర్గా వెళ్ళి అక్కడ అహ్మద్‌ఖాన్ కొలువులో వేగుగా పని సంపాదించాను. మెల్లగా ఇటు విజయనగరం వచ్చి నా పేరు మసూంగా మార్చుకొని వాళ్ళకి వేగుగా పనిజేస్తానని అక్కడ వారిని నమ్మించాను. నేనిన్నాళ్ళూ ఉనందదొకే లక్ష్యంతో. అది దేవరాయల మరణం. అప్పుడు ఒక అరుంధతి జీవితం నాశనమయ్యింది. ఇప్పుడు నేహలపై పడ్డాడు...వాడొక మృగం. వాణ్ణి చంపెయ్యాలి..." అంటూ గట్టిగా అరిచాడు. అతను తన కథ చెబుతున్నంత సేపూ జలజలా కన్నీళ్ళు రాలుతూనే ఉన్నాయి.

అతని గతం తెలిసి ఆడవాళ్ళిద్దరి కళ్ళల్లో కన్నీరుబికింది. మసూం గురించి తెలిసి జాలిగా అతనివైపు చూసారు.

"మరి, నిన్ను దేవరాయలు గుర్తుపట్టలేదా?" నేహలే కొంతసేపటి తరువాతడిగింది.

"లేదు. నా వేషధారణ పూర్తిగా మార్చేసాను. కామాంధులకి కన్యలు తప్ప ఇంకెవరూ కనిపించరు."

అతని మాటల్లో కోపం, అసహ్యం ప్రతిధ్వనించాయి.

"అన్నా, నువ్వూ నన్ను కాపాడావు. నిజంగా నాడు నువ్వు లేకపోతే ఏమయ్యుండేదో?" నేహల భారంగా అంది.

"అవును. ఈ మసూమే కనబడకపోతే  సైన్యం నేహల్ని వదిలి పెట్టేదేకాదు," రేవన్నా నేహలని సమర్ధించాడు.

"మీకు నేను తగిలినట్లుగా నాడు అరుంధతికీ ఎవరైనా సహాయం చేసుంటే ఎంత బావుండేది? నా బ్రతుకిలా అయ్యేదా?" అంటూ గట్టిగా ఏడుస్తూ అక్కడే పెట్టెలో ఉన్న అరుంధతి చీరల్ని మొహానికత్తుకొని బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టాడు. రేవన్న, నేహలా వెళ్ళి ఓదార్చారు.

"బాధపడకు. నీకు మేమున్నాం. మాతోనే ఉండువుగాని," నేహల, రేవన్నా ముక్తకంఠంతో అన్నారు.

కొంతసేపయ్యాక మసూం తేరుకున్నాడు. రేవన్ననీ, నేహలనీ బయటకు రావద్దనీ, ఎవరొచ్చినా వీధితలుపు తీయ వద్దనీ హెచ్చరించాడు. భోజనం చేసి కోట గుమ్మం వైపు వెళ్ళొస్తాననీ చెప్పి బయటకొచ్చాడు.

00000

ఫిరోజ్‌షా ఎవరి మాటా వినే పరిస్థితిలో లేడు. ఎన్నాళ్ళగానో ఊరిస్తున్న ఈ రాయచూరు స్వాధీనం అతని విజయగర్వాన్ని రెట్టింపు చేసింది. ఇహ వెనుదిరిగేది లేదనే నిర్ణయానికొచ్చాడు. సేనల్ని గంగావతి వైపుగా మళ్ళించాడు. గంగావతి వరకూ వచ్చేసరికి తెచ్చుకున్న ఆహారం కాస్తా నిండుకుంది. యుద్ధం చెయ్యాలంటే శక్తి కావాలి. కుడుపు నిండకుండా ఎవరూ పోరాటం చెయ్యరు. దాంతో సైనికులు ఊళ్ళమీద పడ్డారు. ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసి బలవంతాన దోపిడీ మొదలు పెట్టారు. కొంతమంది ప్రజలు ప్రతిఘటించారు. ఎదురొచ్చిన వారిని ఆడా, మగా, పిల్లా, జెల్లా అన్న తేడా లేకుండా చంపేసారు. అంతవరకూ సజావుగా సాగుతున్న ఫిరోజ్‌షా ప్రయాణం ఒక దోపిడి దొంగల మాదిరిగా తయారయ్యింది.

ప్రజలు ఎదురు తిరగడంతో చిన్న యుద్ధం మొదలయ్యింది. గంగావతి చేరకుండానే విపరీతమైన రక్తపాతం చూసాడు ఫిరోజ్‌షా. ఒక దశలో వెనక్కి వెళిపోదామన్న ఆలోచనొచ్చింది. తమకి మరీ అంత సైన్య నష్టం కలగకపోయినా అది చూసి మిగతా వారి ఉత్సాహాన్ని నీరుకార్చింది. ఏం చెయ్యాలో పాలుపోలేదు. గంగావతిని వెనుదిరిగి వెళిపోదామన్న నిర్ణయానికొచ్చాడు.  రాత్రికక్కడే ఉండే మర్నాడు రాయచూరు వెళదామని ఆదేశించాడు.

0000

ఫిరోజ్‌షా రాయచూరుని ఆక్రమించుకున్నాడన్న వార్త ఆనెగొందిలో ఉన్న దేవరాయలకి చేరింది. సైన్యాన్ని అప్రమత్తం చేసాడు. మంత్రులనీ, సైనికాధికారులనీ అక్కడికే పిలిపించి గంగావతి వైపు వెయ్యిమంది సైన్యాన్ని పంపమని చెప్పాడు. అయిదువేల మందిని పంపడం మంచిదని మంత్రి చెప్పినా వినలేదు. అతనికి రాయచూరు దాటి విజయనగరంలో ప్రవేశించడం అంత తేలక కాదని తెలిసు. పైగా తమ సైన్యం బలమూ తెలుసు. అతనికి వాళ్ళని ఎలా తిప్పికొట్టాలో కూడా తెలుసు. తమ రాజ్యంలోకి అడుగుపెట్టాక ప్రాణలతో తిరిగి వెళ్ళలేరన్న ధీమాతో వెయ్యిమంది చాలని సైన్యాన్ని పంపించమన్నాడు. అప్పటికే ఫిరోజ్‌షా గంగావతి చేరుకున్నాడు. ప్రమాదం అంచున ఉన్నాడని దేవరాయలు అనుకోలేదు. సాధారణంగా యుద్ధమనే సరికి మహారాజు ప్రధాన కోటకి వెళతారు. ఆనెగొంది కోటా

ఎంతో కట్టుదిట్టమైనదయినా విజయనగరం కోటకున్నంత రక్షణ లేదు. అదే అతను చేసిన పొరపాటని ఆ సమయంలో గ్రహించలేకపోయాడు.

ఆత్మ విశ్వాసం జాగ్రత్తని అధికమించకూడదు. అదే జరిగితే ఎంతటి ప్రమాదమయినా రావచ్చు. ప్రమాదాలకీ, కష్టాలకీ రాజా, పేదా అన్న తేడా ఉండదు.

0000000000000000

(కొనసాగింపు వచ్చేసంచికలో)

Click here to share your comments on this serial